RNI No - APTEL/2022/81596

janodaya

# జనోదయ

కరీంనగర్ శుక్రవారం13.03.2026 సంపుటి : 03 సంచిక : 97 పేజీలు : 08 వెల : రూ.5

Karimnagar Friday 13.03.2026 Volume: 03 Issue 97 Pages 08 Cost 5/

తెలుగు దినపత్రిక

## ఆర్ఎఫ్‌సీఎల్ బూడిద,భూములపైన నేతల కన్ను

### కోట్లాదిరూపాయలు కొట్టేసే ఎత్తు




7లో..

పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజక వర్గం లోని ఆర్ఎఫ్‌సీఎల్ ఎరువుల కర్మాగారంలో కోట్లాదిరూపాయాల విలువైన నల్ల బూడిదను కొల్లగొట్టడానికి కొందరు నేతలు యత్నిస్తు న్నట్లుగా ఆరోపణలు ఊపందుకున్నా యి.అదేవిధంగా మళ్ళీ కర్మాగారంలో కొలు వుల దందా మొదలయినట్లుగా ప్రచారం కూడా జరుగుతోంది.

ఒక్కొక్క పేజీ తిరగేసిన కొద్దీ వికారం ఎక్కువ అవుతున్నది. నేల విడిచి సాము చేసి ఆచరణ సాధ్యం కానీ, ఆమోద యోగ్యం కానీ అసం బద్ధ ప్రతిపాదనలను కమిషన్ చేసింది. ఈపాటికి ప్రభుత్వం ఈ నివేదికను తెరచి ఉంటే వెంటనే చెత్తబుట్టలో పడవేసి సమాజానికి విద్యా వ్యవస్థ పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని పారదర్శకంగా చాటి చెప్పి ఉండేది.

## నవ్యత పేరుతో నేల విడిచి ఆకునూరి సాము



3లో..

## నిజాం స్ఫూర్తితో

హైదరాబాద్ మధ్య నుంచి ప్రవహిస్తూ కాలుష్యమయంగా మారిన మూసీనదిని పునరుజ్జీవింపజేయాలని సంకల్పించిన రాష్ట్ర ప్రభుత్వం.. అందుకోసం సమగ్ర ప్రణాళికను సిద్ధం చేసింది. నదిని దశలవారీగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ 'మూసీ రివర్ ఫ్రంట్ డెవల్‌పమెంట్ ప్రాజెక్టు' ప్రణాళికను సీఎం రేవంత్‌రెడ్డి నేడు ఆవిష్కరించనున్నారు.

### నేడుమూసీ ప్రాజెక్టు ప్రణాళికను ఆవిష్కరించనున్న సీఎం రేవంత్

# మూసీ పునరుజ్జీవం

20 వంతెనలు.. మొదటి దశలో ఈసీ నది వెంట హిమాయత్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు, మూసీనది వెంట గండిపేట నుంచి బాపూఘాట్ వరకు దాదాపు 21 కిలోమీటర్ల మేర పనులు చేపట్టనున్నారు. నదిపై 20 ప్రాంతాల్లో కొత్తగా వంతెనలు నిర్మిస్తారు. మొదటి దశలో నాలుగు ప్రాంతాల్లో బ్రిడ్జిల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఒక్కో బ్రిడ్జి ఒక్కో రకమైన థీమ్‌తో ఉంటుంది. వీటి కింది భాగంలో చిన్నపాటి డ్యామ్‌లు నిర్మించి, స్వచ్ఛమైన గోదావరి జలాలను నిల్వచేస్తారు. అందులో బోటింగ్ సౌకర్యం ఉంటుంది.



**హైదరాబాద్ , మార్చి12 :** హైదరాబాద్ మధ్య నుంచి ప్రవహిస్తూ కాలుష్యమయంగా మారిన మూసీ నదిని పునరుజ్జీవింప జేయాలని సంకల్పించిన రాష్ట్ర ప్రభుత్వం.. అందుకోసం సమగ్ర ప్రణాళికను సిద్ధం చేసింది. పూర్వకాలంలో నిజాం పాలకులు అనుసరించిన విధానాలతోపాటు ఆధునిక కాలంలో ప్రపంచవ్యాప్తంగా విజయవంతమైన నదీ పునరుజ్జీవ ప్రాజెక్టుల్లోని ఉత్తమ విధానాలను ఇందుకోసం స్వీకరించనుంది. ప్రస్తుతం హైకోర్టు ఉన్న ప్రాంతంలో నిజాం పాలకులు మూసీకి ఇరువైపులా ప్రహరీ నిర్మిం చారు. నదికి ఒకవైపు ఉస్మానియా ఆస్పత్రి.. మరో వైపు హైకోర్టు భవనం, ఇరువైపులా రోడ్డు, రోడ్డుకు దిగువన పచ్చదనం ఉండేలా ఏర్పాట్లు చేశారు. అదే తరహాలో ఇప్పుడు నదిని దశలవారీగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ 'మూసీ రివర్ ఫ్రంట్ డెవల్‌పమెంట్ ప్రాజెక్టు' ప్రణాళికను సీఎం రేవంత్‌రెడ్డి నేడు ఆవిష్కరించనున్నారు.నగరంలో దాదాపు 55 కిలోమీటర్ల మేర ప్రవహిస్తున్న మూసీ నదిలో పెద్దఎత్తున మురుగు చేరుతోంది. దాదాపు 160 ప్రాంతాల్లో నాలాలు, డ్రైనేజీ లైన్ల ద్వారా మురుగు కలుస్తోంది. నదిలోకి ఈ మురుగు చేరకుం డా చర్యలు చేపట్టడంతోపాటు ఇప్పటికే చేరిన మురుగును తొలగించాల్సి ఉంది. ఇందుకోసం నదికి ఇరువైపులా ట్రంక్‌లైన్ల నిర్మాణానికి వాటర్‌బోర్డు ఆధ్వర్యంలో దాదాపు రూ.4,700 కోట్లతో ప్రణాళికలు రూపొందించారు. మురుగును శుద్ధి చేయడానికి వివిధ ప్రాంతాల్లో మరిన్ని సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నిర్మాణానికి వాటర్‌బోర్డు చర్యలు చేపట్టింది. మూసీలో గోదావరి జలాలను ప్రవహింపజేసే పనులు కూడా వాటర్‌బోర్డు నిర్వహిస్తోంది. వచ్చే ఏడాది చివరి నాటికి మూసీనదిలో గోదావరి జలాలు ప్రవహింపజేసేలా పనులు జరుగుతున్నాయి. దక్షిణ కొరియాలోని సియోల్‌లో ఉన్న జుంగ్‌నాంగ్ నది తరహాలోనే మూసీ పునరుజ్జీవానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ ప్రాజెక్టు ఫేజ్-1లో భాగంగా వచ్చే గాంధీ సరోవర్ ప్రాజెక్టును హైదరాబాద్‌కు ఒక ఐకాన్‌గా ఉండేలా నిర్మించనున్నారు. 100మీటర్ల టవర్, దానిపై గాంధీవిగ్రహం.. మ్యూజియం, విజ్ఞాన కేంద్రం ఉండేలా డిజైన్ చేశారు.

# నెట్‌ఫ్లిక్స్ విస్తరణకు సహకారం

హైదరాబాద్‌కు నెట్‌ఫ్లిక్స్ వచ్చిందంటే.. హాలీవుడ్ వచ్చినట్లే

నెట్‌ఫ్లిక్స్ విస్తరణకు కావాల్సిన భూమిని ఫ్యూచర్ సిటీలో ఇవ్వడానికి సిద్ధం

ప్రపంచంలోని 500 పెద్ద కంపెనీలను తెలంగాణకు తీసుకురావడానికి ప్రయత్నం

తెలంగాణలో మీ పెట్టుబడికి పూర్తి రక్షణ

తెలంగాణ రాష్ట్రం అంటేనే వ్యాపారం

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి




**హైదరాబాద్, మార్చి 12 :**

నెట్‌ఫ్లిక్స్‌తో తన కల నిజం కాబోతోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోస్ విస్తరణకు తమ ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. ఫోర్త్‌సిటీని నిర్మిస్తున్నామని.. నెట్‌ఫ్లిక్స్ విస్తరణకు కావాల్సిన భూమిని ఫ్యూచర్ సిటీలో ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. నెట్‌ఫ్లిక్స్ కార్పొరేట్ ఆఫీస్‌ను ఫ్యూచర్ సిటీకి తీసుకురావాలని కోరారు. హైదరాబాద్‌లో నెట్‌ఫ్లిక్స్‌కు చెందిన ఐలైన్ స్టూడియోస్ కార్యాలయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి డి. శ్రీధర్‌బాబు, సినీనటుడు రానా దగ్గుబాటి, నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోస్ సీఈఓ శ్రీ జెఫ్ షాపిరో, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. తనకు సినిమాలపైన ఆసక్తి ఉందని.. తన బాల్యం నుంచి ఇప్పటి వరకు చిత్రరంగంలో అనేక మార్పులు వచ్చాయని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. బాహుబలి, కల్కి, ఆర్ఆర్ఆర్, అరుంధతి వంటి అత్యున్నత సాంకేతికతతో కూడిన సినిమాలు వచ్చాయని చెప్పుకొచ్చారు. చెన్నైలో ఉన్న తెలుగు సినిమా రంగాన్ని నందమూరి తారక రామారావు , అక్కినేని నాగేశ్వరరావు హైదరాబాద్‌కు తీసుకు వచ్చారని గుర్తుచేశారు. నెట్‌ఫ్లిక్స్ హైదరాబాద్ వచ్చిందంటే హాలీవుడ్ వచ్చినట్లేనని పేర్కొన్నారు. తమ దృష్టి హాలీవుడ్‌పైనేనని తాను గతంలోనే చెప్పానని ప్రస్తావించారు. ప్రపంచంలోని 500 పెద్ద కంపెనీలను తెలంగాణకు తీసుకురా వడానికి తాము ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. తెలంగాణలో మీ పెట్టుబడికి పూర్తి రక్షణ ఉంటుందని.. తమ రాష్ట్రం అంటేనే వ్యాపారమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# రేపటి నుంచి పదో తరగతి పరీక్షలు

5,28,239 మంది విద్యార్థులు, 2,676 పరీక్షా కేంద్రాలు



**హైదరాబాద్, మార్చి 12 :** పదో తరగతి వార్షిక పరీక్షలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 5,28,239 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందులో 5,17,727మంది రెగ్యులర్, ఒకసారి ఫెయిలైన 10,512మంది విద్యార్థులు ఉన్నారు. ఈసారి ప్రైవేటు పాఠశాల నుంచి అత్యధికంగా 2,50,015 విద్యార్థులుండగా, ప్రభుత్వ బడుల నుంచి 2,07,573 మంది, సంక్షేమ గురుకులాల నుంచి 60,139 మంది విద్యార్థులు ఉన్నారు. పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా 2,676 కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో 1,582 ప్రభుత్వ, 1,094 ప్రైవేటు విద్యాసంస్థలున్నాయి. హాల్ టికెట్లు ఇప్పటికే అన్ని పాఠశాలకు పంపించామని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్ తెలిపారు. పాఠశాల గుర్తింపు తెలియకుండా సాధారణ దుస్తుల్లోనే విద్యార్థులు పరీక్షకు రావాలని కోరారు. పరీక్షల పర్యవేక్షణకు 144 ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటుచేశామన్నారు. పరీక్షలు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30వరకు ఉంటాయి.

జనోదయ



# ప్రజా సమస్యల పరిష్కారంలో రాజీ పడొద్దు

**●ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగస్వామ్యం కావాలి**

**●అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగాలి**

**●ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

**జనోదయ, హనుమకొండ, మార్చి 12:**

ప్రజా సమస్యల పరిష్కారంలో రాజీ పడొద్దు అని ప్రజాప్రతినిధులకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సూచించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణపై గ్రామీణ, పట్టణ ప్రజాప్రతినిధులకు అవగాహన సదస్సును ఎమ్మెల్యే మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని, ఈ కార్యక్రమంపై నూతనంగా ఎన్నికైన సర్పంచులకు, కౌన్సిలర్లకు, అదేవిధంగా జిడబ్ల్యూఎంసి పరిధిలోని కార్పొరేటర్లకు అవగాహన కార్యక్రమం గ్రామాలు డివిజన్ల అభివృద్ధికి చాలా ఉపయోగమైనది విలువైనదని అన్నారు. ప్రజా ప్రతినిధులు ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుంటే గ్రామాలు, డివిజన్ లు దీని ద్వారా చాలా లబ్ధి పొందే అవకాశాలు ఉంటాయన్నారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకున్నప్పుడే మర్చిపోకుండా ప్రజలు గుర్తుంచుకుంటారని అన్నారు. గ్రామాలు, డివిజన్ల లోని పూర్వ విద్యార్థులు, ఎన్నారైలు గ్రామ అభివృద్ధికి డివిజన్ల అభివృద్ధికి తోడ్పాటు, భాగస్వామ్యం కోసం ప్రజా ప్రతినిధులు సంప్రదించాలని సూచించారు. గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. హనుమకొండ జిల్లాతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎక్కువ నిధులు ఇచ్చారని పేర్కొన్నారు. ప్రజలు ఇచ్చిన అవకాశంతో గ్రామాలు, డివిజన్ల సమగ్ర అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులుగా ముందుకు వెళ్దామన్నారు. ఈ సందర్భంగా వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ...ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాలను ప్రజల్లో తీసుకెళ్లడానికి కార్యక్రమం దోహదపడుతుందన్నారు. వరంగల్ నగరానికి అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ కోసం అత్యధిక నిధులు ఇచ్చినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నానని తెలిపారు.

కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ...ప్రజా పాలన ప్రణాళిక కార్యక్రమంలో పది అంశాలతో 99 రోజుల కార్యచరణ రూపొందించినట్లు తెలిపారు. జిల్లాస్థాయిలో ఇది మొదటి శిక్షణ కార్యక్రమం అని పేర్కొన్నారు. గ్రామాలను అభివృద్ధి పథంలో ప్రజా ప్రతినిధులు ముందుకు నడపాలన్నారు. గ్రామపంచాయతీలను ఆదర్శంగా సర్పంచులు తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. అదేవిధంగా మహిళా సర్పంచులు మిగతా మహిళలకు స్ఫూర్తిగా నిలవాలన్నారు . గ్రామపంచాయతీ డెవలప్మెంట్ ప్లాన్ చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో, పట్టణాల్లో ప్రకృతి వనాలు బాగుండాలన్నారు. అంగన్వాడి కేంద్రాలు బాగుండాలన్నారు. గ్రామపంచాయతీల అభివృద్ధికి సర్పంచులు విజన్ ఇవ్వాలన్నారు.. గ్రామ పంచాయతీలకు రెవెన్యూ పెంచుకోవడానికి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ నిధుల పైనే ఆధారపడకుండా గ్రామపంచాయతీలు సొంత ఆదాయ వనరులను పెంచుకునే విధంగా సర్పంచులు కృషి చేయాలన్నారు. గ్రామపంచాయతీలకు ముఖ్య ఆదాయ వనరు భవన నిర్మాణ అనుమతులు, ఇంటి పన్నులేనని, వాటిని గ్రామపంచాయతీ వసూలు చేసే విధంగా కృషి చేయాలి. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, డి ఆర్ డి వో మేన శ్రీను, పలువురు డి ఎల్ పి ఓ లు, ఇతర అధికారులు 99 రోజుల కార్యాచరణ కార్యక్ర మంపై సర్పంచులు, వార్డు కౌన్సి లర్లు, అయా డివిజన్ల కార్పొరేట ర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఎండి అజిజ్ ఖాన్, పరకాల మున్సిపల్ ఛైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్, జడ్పీ సీఈవో శేషాద్రి, అధికారులు, సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, జిడబ్ల్యుఎంసి కార్పోరేటర్లు పాల్గొన్నారు.



# ముస్లిం కుటుంబానికి అండగా నిలిచిన చేయూత స్వచ్ఛంద సంస్థ

**జనోదయ, మందమర్రి మార్చి 12:**



నిరుపేద ముస్లిం కుటుంబానికి చేయూత స్వచ్ఛంద సంస్థ సభ్యులు అండగా నిలిచారు. కాసిపేట 1 గనిపై గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని గని సమీపంలో నివసించే అహ్మెద్ కుటుంబానికి గని సర్వే అధికారి మహమ్మద్ ఖాన్ చేతుల మీదుగా వేయి రూపాయల ఆర్థిక సహాయం తో పాటు నిత్యావసర వస్తువులు, నూతన దుస్తులు అందించారు. ఈ సందర్భంగా సర్వే అధికారి మహమ్మద్ ఖాన్ మాట్లాడుతూ సర్వే డిపార్ట్ మెంట్ ఉద్యోగులు స్వచ్ఛంద సంస్థను నెలకొల్పి రంజాన్ పర్వదినం సందర్భంగా నిరుపేద ముస్లిం కుటుంబాలకు చేయూత నివ్వడం అభినందనీయమని అన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి నిరుపేదలకు, ఆపదలో ఉన్న వారికి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్య క్షులు ఆడేపు రవీందర్, కార్యదర్శి అంకం రాజమల్లు, ప్రచార కార్యదర్శి విజయ్ సభ్యులు సందీప్, కె రవి, పోశం, కుమారస్వామి, మోహన్, ఆనంద్, ప్రవీణ్, గణేష్, భూక్యా ప్రవీణ్, షకీల్ ఆంజనేయులు,రోహిత్, గని కార్మికులు పాల్గొన్నారు.

## పిహెచ్సి వైద్యులకు ఘన సన్మానం



**జనోదయ, మందమర్రి మార్చి 12:**

పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న వైద్యులు రమేష్, మానసలను పట్టణ బిఆర్ఎస్ నాయకులు ఎండి అబ్బాస్, బర్ల సదానందం లు ఘనంగా సన్మానించారు. గురువారం పిహెచ్సిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైద్యులను ఘనంగా సన్మానించి మాట్లాడారు. గత 6 సం,,గా మండల ప్రజలకు వైద్య సేవలు అందించి ప్రజల మన్ననలు పొందారని వారి సేవలను కొనియాడారు. వైద్య ఉన్నత విద్యనభ్యసించేందుకు వెళ్ళడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. వైద్య ఉన్నత విద్యను పూర్తి చేసుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగి,నిరుపేద ప్రజలకు నిరంతరాయంగా వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు వేముల నర్సయ్య, సాగర్ బాబు,మజార్ సలావుద్దిన్,నోముల శ్రీధర్ గౌడ్‌లు పాల్గొన్నారు.


# చైతన్యంతోనే మోసాలను అరికట్టవచ్చు

**కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్**

**జనోదయ, హనుమకొండ, మార్చి 12:**

చైతన్యం ద్వారానే వినియోగదారుల మోసాలను అరికట్టవచ్చని హనుమ కొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా హను మకొండ జిల్లా కన్స్యూమర్ ఇన్ఫర్మేషన్ సెంటర్ అధ్యక్షుడు డాక్టర్ రతన్ సింగ్ ఠాకూర్ రచించిన వినియోగదారుల హక్కుల చైతన్య కరపత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...రతన్ సింగ్ ఠాగూర్ గత 40 సంవత్సరాలుగా వినియోగ దారుల హక్కుల కోసం ఎన్నో చైతన్యవంతమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కొనియాడారు. ఈనాటి ఈ కరపత్రంలో ,"వినియోగ దారుల హక్కుల పరిరక్షణ చట్టం 2009" వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం మోస మోసపూరిత ప్రకటనలు, హానికరమైన కల్తీలు ,ఆన్ లైన్ విక్రయాలు, మోసాలను వినియోదారులు ఈ చట్టం ద్వారా తమకు తాము ఎలా కాపాడుకోవాలో సవివరంగా ఈ కరపత్రంలో రూపొందించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ వరంగల్ జిల్లా ఎన్ఎస్ఎస్ అధికారి, స్టేట్ కన్స్యూమర్ క్లబ్స్ కోఆర్డినేటర్ కొడిమాల శ్రీనివాసరావు, విజిలెన్స్ కమిటీ మెంబర్ బండ కాళిదాస్, కన్స్యూమర్ యాక్టివిస్ట్ డాక్టర్ జగదీష్ ప్రసాద్,రాజు పాల్గొన్నారు.



జనోదయ



## భవన కట్టడాలు, ఉద్యోగ కూల్చివేతలు

# నవ్యత పేరుతో నేల విడిచి ఆకునూరి సాము

ప్రస్తుత పాఠశాలల్లో అనేక వసతుల వనరుల సమస్యలను ఎదుర్కొంటున్న ట్లు, బహుళ బోధన ఉన్నట్టు, ఆంగ్ల భాషా నైపుణ్యాలను లేమి ఉన్నట్లు, బో ధనేతర కార్యక్రమాలు అధికమైనట్లు, బోధనా సమయం ఉపాధ్యాయుడికి రోజుకు 3 గంటలు మాత్రమే ఉంటున్నట్టు, తరగతి గదుల కొరత, గ్రంథాలయాలు, సైన్స్ లాబ్లు, క్రీడా సౌకర్యాల కొరత ఉన్నట్లు, సహపాఠ్య అంశాల అమలులో ఇబ్బందులు ఉన్నట్లు కమి షన్ గుర్తించింది. దానికి కారణాలు యాజమాన్య, పర్యవేక్షణ మరియు నిధుల కేటాయింపు అని కాకుండా చిన్న తరగతి గదులు - చిన్న పాఠశాలలు అని తీర్మానించి, తెలంగాణ పబ్లిక్ స్కూ ళ్లు మాత్రమే పరిష్కారం అన్నారు. కమి షన్ ఏర్పాటునుండి పబ్లిక్ స్కూళ్ళ భావ న ఇంజెక్ట్ చేస్తూనే ఉన్నారు. మౌలిక వసతులు మరియు కేంద్రీకృతమే ప్రత్యా మ్నాయ మార్గం అన్నారు. అందుబాటు అనేది విస్మరించారు. విద్యాహక్కు చట్టం బహుశా మన రాష్ట్రానికి వర్తించదు అని అనుకున్నారు కాబోలు. లేదా మనది స్వయం ప్రతిపత్తి ఉన్న ప్రత్యేక రాజ్యంగా భావించారో తెలియదు. కమిషన్ తిరిగిన జపాన్ దేశంలో కేవలం ఒక్క విద్యార్థి కోసం ట్రైన్ నడుపుతున్న ప్రభుత్వ అనుభవాన్ని పరిగణించలేకపోయారు. మన దేశ రాష్ట్ర ఆర్థిక వనరులు అందుకు ఆమోదయోగ్యం కాకపో వచ్చు. కానీ ఆ స్ఫూర్తి పట్టుకోలేక పోయారు. ప్రతి గ్రామానికి ప్రభుత్వ పాఠశాలను దూరం చేయడం గురించి పునరాలోచించాలి.

నాణ్యత కోసం ఇచ్చిన సూచనలలో పూర్వ ప్రాథమిక మినహా అన్ని ప్రస్తు తం జరుగుతున్నవే ఉన్నాయి. అయితే అవి ప్రస్తుతం అమలు కావడం లేదన్నారు. విద్యా విషయక అంశాలు ప్రస్తుతం ఉన్న వాటిని వారు సరైన రీతిలో స్వీకరించినట్లు కనపడడం లేదు. ప్రస్తుతం ఫలితాలు అత్యంత స్వల్పంగా ఉండడా నికి గల కారణాలను వారు విశ్లేషించ లేదు. ప్రస్తుత రాష్ట్ర స్థానాన్ని సంవత్స రాల వారిగా ఉదాహరించిన కమిషన్ మెరుగుపడడం కోసం మరెన్నో సూచనలు చేయవలసింది. కానీ అలా జరగ లేదు. పైగా సహకార పునశ్చరణ కోసం 9,10 తరగతులకు సాయంత్రం 4.30 నుండి 6.30 వరకు రెండు గంటలు కేటాయించాలన్నారు. కానీ విద్యార్థుల మానసిక సంసిద్ధత మేరకు విద్యా హక్కు చట్టంలో కేటాయించిన బోధనా అభ్యసన గంటల పరిధిని దాటి వారు అదనంగా రెండు గంటలు కేటాయించడాన్ని మరియు ఆ సమయంలో విద్యార్థుల స్నాక్స్ సంబంధించిన ఎలాంటి వ్యాఖ్యానం లేదు. ఇలాంటి విధానాన్ని భవిష్యత్తులో విలీనం చేయనున్న 11, 12 తరగతులకు కూడా అమలు చేయాలన్నారు. వీటికోసం స్థానికంగా అర్హత కలిగిన కాంట్రాక్టు టీచర్లను నియమించాలని, మెడిసిన్ ఇంజనీరింగ్ పోటీ పరీక్షల సన్నద్ధత వీరి ద్వారా జరగాలని, వారికి ఎస్ సి ఈ ఆర్ టి ద్వారా తగు శిక్షణ ఇవ్వాలని తెలిపారు. అయితే అన్ని గ్రామాలలో ఇలాంటి అర్హ తలు ఉన్నవారు దొరుకుతారా? ప్రభుత్వమిచ్చే పారితోషికం సంతృప్తికరంగా ఉంటుందా? వాలంటరీగా సేవ చేయ వలసి ఉంటుందా? అన్న సంశయాలకు స్పష్టత లేదు. ముఖ్యంగా ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ప్రవర్తన క్రమశిక్షణ భద్రత మరియు డ్రగ్స్ వంటి అంశాలతో ఇబ్బందికరంగా ఉండగా తాత్కాలి కమైన అనధికారిక వ్యక్తులకు పాఠశాలలను మరియు విద్యార్థులను రెండు గంటల పాటు అప్పగించడం వలన భద్రత మరియు రక్షణకు సంబంధించిన సమస్యలు ఏర్పడే అవకాశం ఉంది. తద్వారా ప్రభుత్వ పాఠశాలలపై తీవ్ర అప నమ్మకం పెరిగిపోయే ప్రమాదం ఉన్నది. జిల్లా బోర్డుల ఏర్పాటు అనేది ఓ నూతన ప్రతిపాదన. సరైన పర్యవేక్షణ నిమిత్తం ఇది ఆమోదయోగ్యమైనది కావచ్చు. సంఘాలు అనాదిగా డిమాండ్ చేస్తున్నదే. అయితే హైదరాబాద్ రం గారెడ్డి మేడ్చల్ లను మూడేసి జిల్లాలుగా, అటుపై మిగతా జిల్లాలను ఒక్కొ క్క జిల్లాను ఒక్కొక్క జిల్లా బోర్డులుగా మార్చాలన్నారు. జిల్లా బోర్డులో కలెక్టర్ చైర్మన్ గా, జిల్లా విద్యాధికారి, ఐటిడిఏ పీఓ, ఇద్దరు ప్రధానోపాధ్యాయులు, బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ వర్గాల నుండి 6 మంది ప్రతినిధులు ఇందులో గరిష్టంగా ఉండాలి. అందులో ఇద్దరు మహిళలు కనిష్టంగా, అదనంగా ఇద్దరు జనరల్ కేటగిరి నుండి తల్లిదండ్రులు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్, ఇద్దరు మండల విద్యాధికారులు, ఒక డైట్ ప్రిన్సిపాల్, ఒక స్వచ్ఛంద సంస్థ, గురు కులాల నుండి జిల్లా కోఆర్డినేటర్లు ఉండాలని, వీరంతా ఆలనా పాలన, బోధన ఇత్యాది పాఠశాల వ్యవహారాలను పర్యవేక్షణ చేయాలన్నారు. ఇప్పటికే పారదర్శకమైన సమాజ భాగస్వామ్యం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ పేరిట ఉండగా, ప్రతి నెల పేరెంట్ టీచర్స్ సమావేశాలు నామమాత్రంగానైనా నడుస్తుండగా ఇందులో రాజకీయాలను చొప్పించి ఎలాగైనా టీచర్లను పోక చెక్కలు చేయాలని కమిషన్ భావిస్తున్నట్టుగా తోస్తున్నది. వీళ్లకు అనగా ఈ జిల్లా బోర్డుకు ఉపాధ్యాయులను నియమిం చుకోవడానికి, తొలగించుకోవడానికి అధికారం ఉండాలన్న వెర్రితనం ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ పట్ల వారికున్న చిత్తశుద్ధిగా దర్శనమిస్తున్నది. క్షేత్ర స్థాయి అవసరాల నేపథ్యంలో ఈ జిల్లా బోర్డు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు నిరంతరం సలహా సూచనలు ఇవ్వాలన్నారు. ఇవి స్థానిక పాఠశాలల సాధికారతను బలపరుస్తాయని ఒకవైపు, అసలు ఈ పాఠశాలనే అవసరం లేదని పబ్లిక్ స్కూళ్ళు శరణ్యమని పరస్పర విరుద్ధ అంశాలు నివేదికలో రంగరించారు. రెండేళ్ల ప్రొబేషన్ పీరియడ్‌తో ఐదేళ్ల కాలానికి కాంట్రాక్ట్ పద్ధతిలో ఈ బోర్డ్ ఉపాధ్యాయ నియామకాలు జరపాలని, వారి ప్రతిభను జిల్లా బోర్డు మూ ల్యాంకన పరిచి మరో ఐదేండ్లకు విస్తరించవచ్చన్నారు. వారి ప్రతిభ తక్కువగా ఉన్నట్లయితే రెండు సంవత్సరాల బోనస్ పీరియడ్ అనంతరం తిరిగి పరీక్షించి కుదిరితే మరొక 5 ఏళ్లు పొడిగించాలని, లేనట్లయితే తొలగించాలని సూచించారు. నియామక ప్రక్రియలకు రిజ ర్వేషన్ ప్రక్రియలకు మండలం యూని ట్‌గా ఉండాలని, ఎలాంటి పరిస్థితుల్లో బదిలీ ఉండకూడదని, పనిచేయుచోటనే 15 కిలోమీటర్ల పరిధిలో స్థిరనివాసం ఉండాలన్నారు. రాబోయే విద్యా సంవత్సరంలో ఏర్పడే ఖాళీల భర్తీ ముందస్తుగా జరగాలన్నారు. కమిటీ ఏదైనా ప్రలోభాలకు లోనై ఉపాధ్యాయుని నియామకాన్ని ఐదేళ్లకే నిలిపివేస్తే, ఉద్యో గ అర్హత వయసు దాటిన సదరు వ్యక్తి నడిబజారులో ఉండాలా? సంఘ వ్యతిరేక శక్తిగా మారాలా? ఇందులో పారదర్శకత పక్షపాత కోణాలను వారు స్పృశించలేదు. తరగతి బోధన ప్రతిభ ఆధారితంగా పదోన్నతులు ఉండాలని, విద్యార్థుల ప్రగతి, అసైన్మెంట్‌ల నిర్వహణ, వృత్తిలో నైపుణ్య అభివృద్ధి పదోన్నతులకు ప్రాతిపదికలని కొత్త రాజ్యాంగం రాశారు మురళి గారు. థర్డ్ పార్టీ నిర్వహించిన మూల్యాంకనంపై జిల్లా బోర్డు తుది నిర్ణయం జరగాలన్న మహా గొప్ప సూచన విద్యా వ్యవస్థలో శాశ్వతంగా నిలిచిపోతుంది. అయితే థర్డ్ పార్టీ ఏర్పాటుకు సంబంధించిన మార్గ దర్శకాలు కూడా రూపొందిస్తే బాగుండేది.

ఒక్కొక్క పేజీ తిరగేసిన కొద్దీ వికారం ఎక్కువ అవుతున్నది. నేల విడిచి సాము చేసి ఆచరణ సాధ్యం కానీ, ఆమోద యోగ్యం కానీ అసం బద్ధ ప్రతిపాదనలను కమిషన్ చేసింది. ఈపాటికి ప్రభుత్వం ఈ నివేదికను తెరచి ఉంటే వెంటనే చెత్తబుట్టలో పడవేసి సమాజానికి విద్యా వ్యవస్థ పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని పారదర్శకంగా చాటి చెప్పి ఉండేది.

ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పోస్టుల భర్తీ 50% పదోన్నతులు 50% డైరెక్ట్ నియామకాలతో జరగాలని, ఇది రాబో యే పదేళ్లు మాత్రమే ఉండాలని, అనం తరం 100% డైరెక్ట్ నియామకాల ద్వారా జరగాలని సూచించారు. స్కూల్ అసిస్టెంట్ నియామకానికి ఐదేళ్ల కనీస బోధనా అర్హత, 45 సంవత్సరాల లోపు వయసు ఉండాలని. అంటే స్కూల్ అసిస్టెంటుకు నేరుగా అవకాశం ఉంటుం దాలేదా? చెప్పకుండానే, రాత పరీక్షతో పాటు మానసిక శాస్త్ర, వృత్తి నైపుణ్యాధారిత ప్రశ్నలతో పాటు సంబంధిత విష యపరిజ్ఞానంలో సమగ్ర పరీక్ష జరగా లని, దీనిని ఒక ఐఏఎస్ పరీక్ష కన్నా పకడ్బందీగా దృఢంగా బలంగా నిర్వ హించాలని చెప్పారు. ఇక ఎఫ్ఎసి ఎం ఈఓ విధానానికి తిలోదకాలు ఇచ్చి శాశ్వత ప్రాతిపదికన ఎంఈఓలను ఇవ్వా లని, పబ్లిక్ స్కూళ్ళు ప్రారంభమయ్యాక రెండు మండలాల ఎంఈఓలు సంయుక్తంగా ఒకరు పరిపాలన, ఒకరు విద్యావిషయక అంశాలను చూసుకో వాలని అన్నారు. కానీ వీరు ఐఏఎస్ లేదా ఐపీఎస్ పాసై ఉండాలా? లేదా? అన్నది మాత్రం సూచించలేదు. డిప్యూ టేషన్లకు ఫుల్ స్టాప్ పెట్టాలన్నారు. అటెండర్లు రికార్డు అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు ఎట్టి పరిస్థితుల్లోనూ డీఈఓ విభాగంలోకి పదోన్నతుల కోసం రాకూడదని, వారికి అవకాశం ఉండ కూడదని ఉంటే అది అకాడమిక్ నాణ్యతను మరియు యాజమాన్య నాయకత్వం గౌరవాన్ని తగ్గిస్తుంది అన్నారు.

ఒక్కొక్క పేజీ తిరగేసిన కొద్దీ వికారం ఎక్కువ అవుతున్నది. నేల విడిచి సాము చేసి ఆచరణ సాధ్యం కానీ, ఆమోద యోగ్యం కానీ అసంబద్ధ ప్రతిపాదనలను కమిషన్ చేసింది. ఈపాటికి ప్రభుత్వం ఈ నివేదికను తెరచి ఉంటే వెంటనే చెత్తబుట్టలో పడవేసి సమాజానికి విద్యా వ్యవస్థ పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని పారదర్శకంగా చాటి చెప్పి ఉండేది. ఇప్పటికైనా ప్రభుత్వం కండ్లు మరియు పుస్తకం తెరవాలని కోరుకుందాం.

................

దాసరి శ్రీధర్
కరీంనగర్



## బూరుగుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో

# ఘనంగా వార్షికోత్సవం

### పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు

**జనోదయ : గంగాధర మార్చి 12:** గంగాధర మండలం బూరుగుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం వార్షికోత్సవం మరియు పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గంగాధర మండల అభివృద్ధి అధికారి శ్రీ రాము మాట్లాడుతూ విద్యార్థులు స్వీయ క్రమశిక్షణ పాటిస్తూ ఏకాగ్రతతో చదివితే ఉన్నత స్థాయికి ఎదుగుతారని తెలిపారు. మంచి విద్యతో సమాజంలో మంచి పేరు, గౌరవం పొందవచ్చని ఆయన సూచించారు. ఈ సందర్భంగా బూరుగుపల్లి గ్రామ సర్పంచ్ శ్రీ కళ్యాణ్ పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్‌ను విరాళంగా అందజేశారు. అలాగే పదో తరగతిలో మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థికి రూ.5,000 బహుమతి అందజేస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో గంగాధర మండల ఎంపీడీవోరాము, బూరుగుపల్లి గ్రామ సర్పంచ్ శ్రీ కళ్యాణ్, కొండయ్యపల్లి సర్పంచ్ శ్రీ వినయ్ సాగర్, ఉప సర్పంచ్ తిరుపతి, ఏఏపీసీ చైర్పర్సన్ మాధవి, గ్రామ కార్యదర్శి, వార్డు సభ్యులు, ప్రధానోపాధ్యాయులు డాక్టర్ ఎలిగేటి మల్లికార్జున్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



# వేముల మానసకు ఘనంగా సన్మానం



**జనోదయ, బెల్లంపల్లి, మార్చి12:** రామాయణంలోని 2800 శ్లోకాలను 150 నిమిషాల్లో వాడి ఇంటర్నేషనల్ వండర్ బుక్ లో రికార్డ్ నెలకొల్పిన సందర్భంగా బెల్లంపల్లి పట్టణానికి చెందిన వేముల మానస శ్రీనివాస్‌ను గురువారం జయతే సేవా సంస్థ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సత్యమేవ జయతే సేవా సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ఆసం అశోక్ మాట్లాడుతూ వేముల మానస రామాయణం లోని 2800 శ్లోకాలను 150 నిమిషాల్లో చదివి ప్రతిష్టాత్మకమైన అవార్డును దక్కించుకుని శ్రీ శక్తి గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పారని కొనియాడారు. మహిళలందరూ భారతీయ సంస్కృతి పట్ల అవగాహన కలిగి ఆధ్యాత్మిక పట్ల ఆసక్తి చూపాలన్నారు. జీవన విధానంలో అత్యున్నతమైన విలువలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సత్యమేవ జయతే నివాసంస్థ సభ్యులు రేవెల్లి రాజలింగు, శనిగారపు స్వామి,సాయి,రజిత,మమత పాల్గొన్నారు.

# పశువులకు గాలికుంటు టీకాలు

### కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

**జనోదయ,హనుమకొండ: మార్చి 12:** హనుమకొండ జిల్లా వడ్డేపల్లి ప్రాథమిక పశువైద్య కేంద్రంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఈ వైరస్ వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు 2019 నుంచి ప్రతి ఆరు నెలలకు ఒకసారి పశువులకు టీకాలు వేయడం జరుగుతోందన్నారు. అన్ని పశువులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించడం ద్వారా ఈ వ్యాధిని పూర్తిగా నివారించవచ్చని తెలిపారు. రైతులు తమ పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, పాలు అధికంగా రావాలనే ఉద్దేశంతో తెలియని ఇంజెక్షన్లు ఇవ్వకుండా జాగ్రత్తపడాలని సూచించారు. స్వచ్ఛమైన పాలను ఉత్పత్తి చేసేలా పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమం గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు గోడపత్రికలు కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. ప్రతి గ్రామంలో గోడలకు గోడపత్రికలను అంటించి, కరపత్రాలను రైతులకు పంపిణీ చేసి టీకాల కార్యక్రమంపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచిం చారు. జిల్లా పశువైద్య పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రాధాకృష్ణ మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి సోకిన పశువులకు అధిక జ్వరం రావడం, నోటిలో, కాళ్ల మధ్య పుండ్లు ఏర్పడటం వల్ల పశువులు మేత మేయలేక బలహీనపడతాయని తెలిపారు. దీనివల్ల పాల దిగుబడి తగ్గి రైతులకు ఆర్థిక నష్టం కలుగుతుందని చెప్పారు. మార్చి 10 నుండి ఏప్రిల్ 9 వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని గ్రామాల్లో పశువైద్య సిబ్బంది పశువులకు ఉచితంగా టీకాలు వేస్తారని తెలిపారు. మూడు నెలలు దాటిన ప్రతి పశువుకు ఈ టీకా వేయిం చుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారులు, వడ్డేపల్లి పశువైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమా ర్, ఇతర పశువైద్య సిబ్బంది, రైతులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.




# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

### జగిత్యాల పురపాలిక 2026--27 బడ్జెట్ సమావేశం





**జనోదయ, జగిత్యాల ప్రతినిధి, మార్చి 12** జగిత్యాల పురపాలిక సంఘం 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, అదనపు కలెక్టర్ రాజా గౌడ్, మున్సిపల్ కమిషనర్ స్పందన, వైస్‌చైర్మన్ జీనత్ పర్వీన్ మున్నా, కౌన్సిలర్లు మరియు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు. రాబోయే ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదిత ప్రణాళికలు, పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, రహదారులు, వీధిదీపాలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సభ్యులు సూచనలు చేశారు. బడ్జెట్ అమలులో పారదర్శకత, సమయపాలనకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు.

## ప్రైవేటు ఉద్యోగంపై విరక్తితో

# ఉరేసుకుని యువకుని ఆత్మహత్య

**జనోదయ, బెల్లంపల్లి, మార్చి 12:** కాసిపేట మండలం లంబడి తండా (డి) గ్రామానికి చెందిన అలిశెట్టి హరీష్ ఉద్యోగం రాలేదన్న మనస్తాపంతో ఇంట్లో దూలానికి లుంగీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు దేవాపూర్ ఎస్సై గంగారాం తెలిపారు. మృతుని తండ్రి అలిశెట్టి రాజయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం ఉదయం మేషన్ పని కి దేవాపూర్ వెళ్లగా, అతని భార్య గంగవ్వ జన్నారంలోని బంధువుల ఇంటికి వెళ్ళింది. అలిశెట్టి రాజయ్య మేషన్ పని ముగించుకొని సాయంత్రం ఇంటికి వచ్చేసరికి తలు పులు దగ్గరికి వేసి ఉన్నాయి. తలుపులు తెరిచి లోపలికి వెళ్లేసరికి హరీష్ దూలా నికి ఉరేసుకుని ఉన్నారు. మృతుడి ప్యాంట్ జేబులో సూసైడ్ నోట్ లభించింది. మృతుడు హరీష్ మైనింగ్ డిప్లమో చేసి, ఇంజనీరింగ్ చదవాలని మ ధ్యలోనే ఆపేసి పని చేసుకుంటూ ఓపెన్ డిగ్రీ పూర్తి చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం పోటీపడినప్పటికీ ఉద్యోగం రాక




పోవడంతో మానసికంగా కృంగిపోయి ఒత్తిడికి గురై ప్రైవేటు ఉద్యోగం చేయలేక చనిపోతున్నానని సూసైడ్ నోట్ లో రాసుకున్నాడు. తండ్రి అలిశెట్టి రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గంగారాం తెలిపారు.



# కూరగాయల వ్యర్థ్యాలను డబ్బాల్లో వేయాలి

**● నరాభివృద్ధికి ఆర్ఎఫ్సిఎల్ సహకరించాలి**

**● రామగుండం మేయర్ మహంకాళి స్వామి**

**జనోదయ, గోదావరిఖని, మార్చ్ 12:**

తడి చెత్తను కంపోస్ట్ ఎరువుగా రీ సైకిలింగ్ చేయడానికై కూరగాయల వ్యర్థాలను డబ్బాలో ఉంచి మునిసిపల్ పారిశుధ్య వాహనాలకు అందించాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి కోరారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా గురువారం శివాజీనగర్ కూరగాయాల మార్కెట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గౌతమి నగర్ కంపోస్ట్ యార్డ్‌ను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పళ్ళు, కూరగాయల వ్యర్థాలను కంపోస్ట్‌గా , బయో గ్యాస్‌గా మార్చేందుకు రీ సైకిలింగ్ ప్రక్రియ ఆన్ సైట్‌లోనే చేపట్టేందుకు త్వరలో చర్యలు తీసుకొనున్నట్లు తెలిపారు. ప్రతి ఇంట్లో , షాపులో డబ్బాలు పెట్టుకొని తడి చెత్త , పొడి చెత్తగా వేరు చేసి అందించాలని అన్నారు. రోడ్లు , కాలువల్లో వేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు . మార్కెట్‌లో కూరగాయల వ్యాపారులతో కరచాలనశీ చేస్తూ స్వచ్ఛ మార్కెట్ -- స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దడానికి సహకరించాలని కోరారు. మార్కెట్ ప్రక్కన ఉన్న పెద్ద కాలువను పరిశీలించారు . రామగుండం నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో తమ వంతు కృషి చేస్తామని అందరితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మనో చైతన్య మానసిక వికలాంగుల కేంద్రం వద్ద నిర్వహించిన స్పెషల్ సానిటేషన్ డ్రైవ్‌లో పాల్గొన్నారు. ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచ రణ ప్రణాళికలోభాగంగా నిర్వహిస్తున్న సానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో ట్రాన్స్ జెండర్స్ భాగస్వాములై పాలు పంచుకుంటున్నందుకు అభినందనలు తెలిపారు. ప్రజలందరూ ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో పాలు పంచుకోవాలని అన్నారు. ఆతరువాత నగర పాలక సంస్థ కార్యాలయం ఆవరణ పరిశీలించారు. కార్యాలయం ఆవరణ అంతా పరిశుభ్రంగా పచ్చదనంతో అందమైన లాండ్ స్కేప్‌తో కళ కళలాడేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో నగర డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య , కార్పొరేటర్లు తిప్పారపు మానస , కల్వల పద్మావతి నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి , ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి వి రామన్ , జిల్లా సంక్షేమాధికారి వేణు గోపాల్ రావు , సి డి పి ఓ అలేఖ్య , ఎఫ్ ఆర్ ఓ స్వర్ణ లత, ఐ సి డి ఎస్ సూపర్ వైజర్ జమున తదితరులు పాల్గొన్నారు. ఆర్ ఎఫ్ సి ఎల్ సంస్థ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద నగరాభివృద్ధికి సహకరించాలని రామగు ఒడం నగర మేయర్ మహంకాళి స్వా మి కోరారు. గురువారం ఆర్ ఎఫ్ సి ఎల్ సంస్థ నగరపాలక సంస్థకు సి ఎస్ ఆర్ కింద 550 ఎల్ ఇ డి లై ట్లు అందజేసింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మేయర్ మాట్లాడుతూ ప్రభావిత ప్రాంతాలలో ప్రజలకు మౌ




లిక సదుపాయాలు కల్పించడానికి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించడానికి ఆర్ ఎఫ్ సి ఎల్ సంస్థ సహకరించాలని కోరారు. కాగా గతంలో సమర్పించిన ప్రతిపాదనల మేరకు 70 వాట్ల లైట్లు 250 , 45 వాట్ల లైట్లు 300 ఇప్పుడు అందజే స్తున్నామని మరో 15 రోజుల్లో మరో 70 లైట్లు అందజేస్తామని ఆర్ ఎఫ్ సి ఎల్ అధికారులు తెలిపారు . ఈ సందర్భంగా మేయర్ మహంకాళి స్వామికి శాలువా కప్పి అభినందనలు తెలి పారు. మరో వెయ్యి వీధి దీపాలు మెటీరీయల్ ఇవ్వాలని ఈ సందర్భంగా మేయర్ వారికి ప్రతిపా దనలు సమర్పించారు. ఈ కార్యక్ర మంలో ఆర్ ఎఫ్ సి ఎల్ యూనిట్ హెడ్ బాల సుబ్రహ్మణ్యం, ఎలెక్ట్రికల్ డిపార్ట్మెంట్ హెడ్ సురేంద్ర బాబు, జి ఎం హెచ్ ఆర్ సోమ్‌నాథ్ , సీనియర్ మేనేజర్ వెంకట్ రెడ్డితో పాటు నగర పాలక సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి వి రామన్,ఎ సి పి శ్రీ హరి , ఎ ఇ రాంజీ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు పాటుపడాలి

**•ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికను సక్సెస్ చేయాలి**

**•పారిశుద్ధ్యాన్ని పకడ్బందీగా నిర్వహించాలి**

**•పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి**

**•మంత్రి కొండా సురేఖ**

**జనోదయ, గీసుకొండ, మార్చి 12:**

గ్రామాల అభివృద్ధే రాష్ట్ర ప్రగతికి పునాదని, గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా పనిచేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. గురువారం వరంగల్ జిల్లాలోని గీసు గొండ మండలం మరియాపురం గ్రామంలోని ఎస్.ఎస్. ఫంక్షన్ హాల్‌లో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికపై జిల్లాలోని ప్రజాప్రతినిధులకు నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని, నగర మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం మార్చి 6 నుండి జూన్ 12 వరకు అమలు చేస్తున్న 99 రోజుల కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. సర్పంచ్ నుంచి మంత్రి వరకు ప్రతి ఒక్కరూ స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి దార్శనికతకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని, సంక్షేమ పథకాలు, ప్రజా సేవలను ప్రజల్లోకి వేగంగా తీసుకెళ్లాలని ఆదేశించారు. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం, పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను క్లియర్ చేయడం, గ్రామాలు, పట్టణాల్లో పరిశుభ్రత కార్యక్రమాలను ప్రత్యేకంగా చేపట్టడం, ప్రభుత్వ సేవలను ప్రజలకు సులభతరం చేయడం ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు.

**పారిశుద్ధ్యం కీలకం...**

గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, ప్రజల భాగస్వామ్యంతో గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని అన్నారు. గ్రామాలు, పట్టణాల అభివృద్ధిలో పారిశుధ్యం అత్యంత కీలకమని తెలిపారు. పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తూ పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. పరిశుభ్రతను పాటించడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని, ప్రజల ఆరోగ్యం కాపాడటంలో శానిటేషన్ ముఖ్య పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు గ్రామాలు, పట్టణాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను నియంత్రిస్తూ పర్యావరణానికి హాని కలిగించని ప్రత్యామ్నాయాలను ఉపయోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ విధంగా పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేస్తే గ్రామాలు, పట్టణాలు మరింత శుభ్రంగా, ఆరోగ్యకరంగా మారుతాయని మంత్రి తెలిపారు.

**విస్తృతంగా మొక్కలు నాటాలి...**

గ్రామాల్లో పర్యావరణ పరిరక్షణ కోసం విస్తృతంగా మొక్కలను నాటి వాటిని సంరక్షించడం అత్యంత అవసరమని తెలిపారు. మొక్కలు పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు మరియు ప్రకృతి విపత్తులను తగ్గించడంలో చెట్లు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. గ్రామ పంచాయతీలు అవసరమైన మొక్కల కోసం ఇండెంట్ పంపితే సంబంధిత శాఖ ద్వారా సరఫరా చేస్తామని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో పచ్చదనం పెంపొందించేందుకు ప్రజాప్రతినిధులు ముందడుగు వేయాలని మంత్రి పిలుపునిచ్చారు. శిక్షణ కార్యక్రమాల్లో నేర్చుకున్న విషయాలను ఆచరణలో పెట్టి ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ వారి విశ్వాసాన్ని పొందాలని సూచించారు. నగర మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ...ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం ప్రజల సంక్షేమం, సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా వినూత్న సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యాలు సాధించేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని మేయర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ... గ్రామాలు, పట్టణాల సమగ్ర అభివృద్ధి



లక్ష్యంగా ప్రభుత్వం గుర్తించిన 10 కీలక అంశాలపై ప్రత్యేక కార్యాచరణను అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఐదు దశల్లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఏప్రిల్ 2న గ్రామ స్థా యిలో గ్రామ సభలు, ఏప్రిల్ 16న మండల స్థాయి కార్యక్రమాలు, మే 2న నియోజకవర్గ స్థాయి కార్యక్ర మాలు, మే 22న జిల్లా స్థాయి కార్య క్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కా ర్యక్రమాలు ముగుస్తాయని తెలిపా రు. పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్ ఫైళ్ల క్లి యరెన్స్, ప్రజల ఆరోగ్యం, రోడ్డు భద్రత (అరైవ్-అలైవ్), సంక్షేమ పథ కాల అమలు, పిల్లల భద్రత, డ్రగ్స్‌కు అడ్డుకట్ట, రైతు సంక్షేమ, వ్యవసాయం అభివృద్ధి, విద్యారంగం, యువత, క్రీడలు, మహిళల సాధికారత, పర్యావరణ పరిరక్షణ వంటి 10 ము ఖ్య అంశాలపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు.



**కూసం రాజమౌళికి నివాళులు...**

కార్యక్రమానికి ముందు ఇటీవల మరణించిన గంగదేవిపల్లి మాజీ సర్పంచ్ కూసం రాజమౌళికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. నూతనంగా ఎన్నికైన సర్పంచులు, కౌన్సిలర్లకు, ప్రజాప్రతినిధులకు ఐడెంటిటీ కార్డులు అందజేశారు. అనంతరం డీఆర్‌డీఏ, ఉద్యానవన శాఖ, స్వయం సహాయక సంఘాలు, పునరుత్పాదక ఇంధన తదితర శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో వర్ధన్నపేట, నర్సంపేట చైర్పర్సన్ లు సారంగపాణి, పెండ్యాల లక్ష్మీ, డిసిపి అంకిత్ కుమార్ , డిఎఫ్ఓ అనుజ్ అగర్వాల్, ఆదనవు కలెక్టర్లు సంధ్యారాణి, వై వి గణేష్, జెడ్పి సీఈఓ రామ్ రెడ్డి, డిపిఓ కల్పన, జిల్లాలోని సర్పంచులు, కౌన్సిలర్లు మరియు జి.డబ్ల్యూ.ఎం.సి పరిధిలోని కార్పొరేటర్లు,అధికారులు పాల్గొన్నారు.

# పాదయాత్రను విజయవంతం చేయండి

**మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో బీజేపీ నేతల సన్నాహక సమావేశం**



**జనోదయ, హనుమకొండ, మార్చి 12:**

హనుమకొండ జిల్లా,ఎల్కతుర్తి మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్ర విజయవంతానికి గ సన్నాహక సమావేశం నిర్వహించారు. మండల బీజేపీ అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ కరీంనగర్ మున్సిపాలిటీతో పాటు సర్పంచ్ వార్డ్ మెంబర్ ఎన్నికల విజయోత్సవం సందర్భంగా కేంద్ర హోం సహాయ శాఖ మంత్రి బండి సంజయ్ కుమార్ కరీంనగర్ నుంచి కొండగట్టు వరకు పాదయాత్ర చేపట్టి ఆంజనేయ స్వామిని దర్శించుకుంటామని ఇచ్చిన మాట మేరకు ఈ నెల 14వ తేదీ శనివారం ఉదయం 6 గంటలకు కరీంనగర్ శక్తిపీఠం నుంచి కొండగట్టు వరకు పాదయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పాదయాత్రలో గెలిచిన మున్సిపల్ కౌన్సిలర్లు సర్పంచ్‌లు వార్డ్ మెంబర్లు బీజేపీ నాయకులు కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని బండి సంజయ్‌తో కలిసి పాద యాత్రగా వెళ్లి అంజన్న స్వామిని దర్శించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి గ్రామం నుంచి కనీసం 10 మందికి తగ్గకుండా మొత్తం 250 మంది కరీంనగర్‌కు చేరుకొని పాదయాత్రలో చురుకుగా పాల్గొనాలని గ్రామ శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌లు బూత్ అధ్యక్షులు మరియు సర్పంచ్‌లు, వార్డ్ మెంబర్‌లుగా పోటీ చేసిన అభ్యర్థులకు సూచనలు చేశారు. అనంతరం సూరారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తక్కళ్లపల్లి సంపత్ రావు (కబడ్డీ సంపత్ రావు)ను భారతీయ జనతా పార్టీలోకి ఆహ్వానించి శాలువాతో సన్మానించారు. ఈ సమావేశంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఎర్రగొల్ల శ్రీనివాస్ యాదవ్ సీనియర్ నాయకులు చిదురల వెంకటేష్ మాజీ సర్పంచులు శ్యామల సురేష్ రెడ్డి కుడుతాడు రాజు చల్ల రవీందర్ రెడ్డి శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ ఠాకూర్ శామ్ సింగ్ సింగనబోయిన రాజు అంబ్బీర్ శ్రీనివాస్ బీట్ల లింగయ్య చదిరం రాకేష్ కొలిపాక శ్రీనివాస్ వీరమల్ల కృష్ణారెడ్డి బొక్కలపాటి కుమార్ కొమ్మిడి లక్ష్మిరెడ్డి ముప్పు రమేష్ సల్పాల కిరణ్ సిద్దు గానబోయిన నాగరాజు ఆర్‌ఎంపీ రంజిత్ కనుకుంట్ల రమణాచారి విద్యా సాగర్ తోట మల్లయ్య అల్లి కుమార్ గొర్రె ప్రవీణ్ వడ్లకొండ రమేష్ గూడెం నాగరాజు నరేడ్ల శంకర్ సాతూరి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

**సరస్వతి విద్యా మందిర్ పాఠశాలకు**

# నూతన పాలకవర్గం ఏర్పాటు




**జనోదయ : శేరిలింగంపల్లి మార్చి 12 :**

చందానగర్‌లోని సరస్వతి విద్యా మందిర్ పాఠశాలకు నూతన పాలకవర్గాన్ని గురువారం ఏర్పాటు చేశారు. పాఠశాల ఆవరణలో ఉదయం 10.30 గంటలకు నిర్వహించిన సమావేశంలో సభ్యుల సమక్షంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీకి అధ్యక్షుడిగా వంగల్లు రామచంద్ర రెడ్డి, ఉపాధ్యక్షుడిగా కాశిరెడ్డి సుధీప్ రెడ్డి, కార్య దర్శిగా మూగల రఘునందన్ రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా మాకినేని నరేంద్ర ప్రసాద్, ట్రెజరర్‌గా గౌరిశెట్టి నాగభూషణరావు ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా కాశిరెడ్డి శ్రీపాల్ రెడ్డి, పులిపాటి ధీరజ్ కుమార్, పి.వి. దుర్గామహేశ్వర రావు, సలహాదారుగా ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో పాఠశాల నిర్వహణ, విద్యా ప్రమాణాల మెరుగుదల తదితర అంశాలపై చర్చించారు.

**స్వచ్ఛందంగా**

## శ్మశాన వాటిక పనులకు సహకారం



**జనోదయ, హనుమకొండ, మార్చి 12:**

హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం జీడబ్ల్యూఎంసీ పరిధిలోని 65 డివిజన్ చింతగట్టు,సుభాష్ నగర్‌లో శ్మశాన వాటిక నిర్మాణ పనులకు కాయిత రఘువీర్ రెడ్డి స్వచ్ఛందంగా తన సహకారాన్ని అందించారు. స్థానికుల కోరిక మేరకు రఘువీర్ రెడ్డి స్పందించారు. ఈమేరకు స్మశాన వాటికలోని బోరు నిర్మాణ పనులకు మెటీరియల్‌ను అందజేశారు. దీంతో బోర్ నిర్మాణ పనులు చేపట్టి పూర్తిచేశారు. నిర్మాణ పనులతో బోర్ యథావిధిగా పనిచేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. స్వచ్ఛందంగా స్మశాన వాటిక బోర్ నిర్మాణ పనుల కు ముందుకు వచ్చిన రఘువీర్ రెడ్డికి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సోంపల్లి మహేందర్, నద్దునూరి సంపత్, మేకల ఐలయ్య, కృష్ణంరాజు, సంపత్ రాజు,హరీష్, ప్రశాంత్ రాజు పుల్ల అజిత్,కోటేశ్వర్,బాస్కర్‌లు పాల్గొన్నారు.

# ఆర్ సీసీ పైప్ లైన్‌తో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం

**కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్**



**జనోదయ : శేరిలింగంపల్లి:**

భూగర్భ డ్రైనేజీ సమస్య పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామని డివిజన్‌లో మౌలిక వసతులు కల్పిస్తామని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ అన్నారు. శేరిలిం గంపల్లి డివిజన్ గోపినగర్, నెహ్రూ నగర్‌ల లో డ్రైనేజీ పైప్ లైన్ పనులను కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూగర్భ డ్రైనేజీ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామని, పలు కాలనీలలో ప్రజల నుండి వచ్చిన వినతి మేరకు అలాగే మా దృష్టికి వచ్చిన సమస్యలను పరిగణలోకి తీసుకుని ప్రత్యేక చొరవతో డివిజన్ అభివృద్ధిలో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అత్యవసరం ఉన్న చోట, నిత్యం పొంగుతున్న ప్రాంతలలో ప్రథమ ప్రాధాన్యతగా పనులు పూర్తి చేసామని అన్నారు. అందులో భాగంగా యుద్ధప్రాతిపదికన ప్రత్యేక చొరవతో ఎన్నో ఏళ్ల క్రితం వేసిన ఓపెన్ నాలాల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వాటి స్థానంలో ఆర్ సీసీ పైప్ లైన్ వేయించి శాశ్వత పరిష్కారంగా పనులను ప్రారంభిస్తున్నట్లు కార్పొరేటర్ తెలిపారు. కాలనీలలో మౌలిక వసతులు కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ.. కాలనీలను, బస్తీలను అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్తూ సమస్య రహిత ఆదర్శవంతమైన కాలనీలుగా తీర్చిదిద్దడమే ప్రథమ లక్ష్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ డిజిఎం శ్రీహరి, మాజీ కౌన్సిలర్ రాజేశ్వర్మ, సీనియర్ నాయకులు యాదా గౌడ్, ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, దేవులపల్లి శ్రీకాంత్, గఫూర్, రవీందర్, సుధాకర్ రెడ్డి, సత్యనారాయణ, నంసింహా, మహేందర్ సింగ్, దస్తగిర్, బబ్లు, సాయి, అలీం, రాంచందర్, శివ, వెంకటయ్య, హరీష్, సలీం, ఉమా, సాయికిరణ్, విజయ్, వెంకట్, నాందేవ్, సాయికిరణ్ గౌడ్, సంతోష్ గౌడ్, శ్రీనివాస్, ప్రసాద్, మ హిళలు గిరిజ, శాంత, లక్ష్మి పాల్గొన్నారు.

**మంత్రి వివేక్‌తోనే**

# చెన్నూరు అభివృద్ధి

**-కాంగ్రెస్ నాయకులు తుంగపిండి రాజేష్ కుమార్-**

**జనోదయ, మందమర్రి మార్చి 12:**



రాష్ట్ర కార్మిక గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి సహకారంతో చెన్నూరు నియోజకవర్గం సంపూర్ణ అభివృద్ధి సాధిస్తుందని దళితరత్న కాంగ్రెస్ సీనియర్ నాయ కులు తుంగపల్లి రాజేష్ కుమార్ స్పష్టం చేశారు. గురువారం పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ చెన్నూరు నియోజ కవర్గం అభివృద్ధి ధ్యేయంగా రాష్ట్రమంత్రి వివేక్ పనిచేస్తున్నారన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన పుటి నుండి కోట్లాది రూపాయలు నిధులు మంజూరు చేయించి చెన్నూరు, క్యాతనపల్లి, మందమర్రి, మున్సిపాలిటీలతోపాటు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో విస్తృతంగా అభివృద్ధి పనులు ప్రారంభించారని గుర్తు చేశారు.

# వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

**అధికారులకు ఎమ్మెల్యే కాల్వ ఆదేశాలు**

**జనోదయ : డి హీరేహాళ్ (రాయదుర్గం) మార్చి 12**



వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల ఇంజనీర్లు, అధికారులను ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆదేశించారు. రాయదుర్గం పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో గురువారం సాయంత్రం గ్రామీణ నీటి సరఫరా విభాగం, ఎంపీడీవోలు, మున్సిపల్, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం అధికారులతో ఎమ్మెల్యే ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాయదుర్గం నియోజకవర్గ పరిధిలో ముందస్తు ప్రణాళికతో మంచినీటి సమస్య లేకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ముఖ్యంగా పల్లెల్లో గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజనీర్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సమన్వయంతో పని చేయాలన్నారు. అలాగే రాయదుర్గం మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ కమిషనర్, ఇంజనీర్లతో పాటు శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం సిబ్బందితో సమన్వయంతో వ్యవహరించాలన్నారు. ప్రతి మూడు రోజు లకు ఒకసారి తాగునీటి పరిస్థితిపై సమీక్షించుకోవాలని సూచించారు. ఎక్కడ ఎలాంటి సమస్య ఉందో ముందే గుర్తించి అవసరమైన పనులు చేపట్టాల న్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైన చోట్ల బోర్ల మరమ్మతు, కొత్త బోర్ల ఏర్పాటు, మోటర్ల కొనుగోలుకు రూ.93 లక్షలు అవసరం అవుతుందని అధికారులు ప్రతిపాదించారు. రాయదుర్గం మున్సిపాలిటీ పరిధిలో మరో రూ.55 లక్షలు అవసరమని మున్సిపల్ అధికారులు నివేదించారు. వీటితో పాటు నియోజకవర్గ పరిధిలో 114 జనావాసాలకు తాగునీరు అందిస్తున్న శ్రీరామిరెడ్డి తాగు నీటి పథకం నిర్వహణపై సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే చర్చించారు. ఆయా ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా చూడాల న్నారు. ఈ సమీక్షలో మున్సి పల్ కమిషనర్ దివాకర్ రెడ్డి, డీ.ఈ. సురేష్, ఆర్.డబ్ల్యూ.ఎస్, డి.ఈ. రామారావు పాల్గొన్నారు.

# ఆర్ఎఫ్‌సీఎల్ బూడిదపై నేతల కన్ను?

- ●కోట్లాది రూపాయల విలువైన బూడిదను సొమ్ముచేసుకునే ఎత్తుగడలో నేతలు ?
- ●కర్మాగార అధికారులపై ఒత్తిడి?
- ●మళ్లీ షురువైన కొలువుల దందా ?
- ●కర్మాగార విలువైన భూములను కాజేయడానికి కొందరు నేతల యత్నం

**జనోదయ : గోదావరిఖని**

పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజక వర్గం లోని ఆర్ఎఫ్‌సీఎల్ ఎరువుల కర్మాగారంలో కోట్లాదిరూపాయాల విలువైన నల్ల బూడిదను కొల్లగొట్టడానికి కొందరు నేతలు యత్నిస్తున్నట్లుగా ఆరోపణలు ఊపందుకున్నాయి.అదేవిధంగా మళ్ళీ కర్మాగారంలో కొలువుల దందా మొదలయినట్లుగా ప్రచారం కూడా జరుగుతోంది. అదేవిధంగా ఎరువుల కర్మాగారానికి చెందిన భూములపైన కూడా కొందరు నేతల కన్నుపడి స్వాహా చేసే ఎత్తుగడలో ఉన్నట్లుగా స్థానికుల్లో చర్చ నడుస్తోంది.గత బీఆర్ఎస్ హయాంలో ఆర్ఎఫ్‌సీఎల్‌లో ఉద్యోగాల పేరుతో నిరుద్యోగ యువత నుంచి కొందరు నేతలు లక్షలాది రూపాయలు తీసుకుని వారిని మోసగించిన విషయం తెల్సిందే.తాత్కాలిక ఉద్యోగాల కోసం అప్పులు చేసి లక్షలాది రూపాయలు కొందరు నేతలకు చెల్లించి మోసపోయిన వారిలో కొందరు బలవన్మరణాలకు పాల్పడిన విషయం తెల్సిందే.తాము అధికారంలోకి వస్తే ఆర్ఎఫ్‌సీఎల్ బాధితులకు న్యాయం చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో వాగ్దానం చేసింది.అయితే అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినా ఇంతవరకూ బాధితులకు న్యాయం జరగలేదు.అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోని పంథాలోనే మళ్ళీ నేడు కూడా కొలువుల దందా షురువైనట్లుగా గుసగుసలు విన్పిస్తున్నాయి.అన్నింటికన్నా ముఖ్యంగా ఆర్ఎఫ్‌సీఎల్‌లో కోట్లాది రూపాయల విలువైన నల్ల బూడిద ఉన్నట్లుగా సమాచారం.ఈ బూడిదను ఎలాగైనా మాయం చేయాలనే ఎత్తుగడలో ముఖ్యనేత ఒకరి కన్నుపడినట్లుగా ప్రచారం జరుగుతోంది.ఈ బూడిదను సొమ్ముచేసుకునే అవకాశం ఇవ్వాలని ఆర్ఎఫ్‌సీఎల్ అధికారులపైన తీవ్రమైన ఒత్తిడిని తీసుకొస్తున్నారనే ఆరోపణలున్నాయి.కార్మికులతోపాటు కొందరు స్థానిక నేతలు కూడా వివిధకారణాలు సాకుగా చూపెడుతూ కర్మాగారం ఎదుట అలజడి చేసి ఎలాగైనా విలువైన బూడిద తరలింపునకు మార్గాన్ని సుగమం చేసుకునే ఎత్తుగడలో ఉన్నారనే వార్తలు వస్తున్నాయి. బూడిద కోసం వస్తున్న ఒత్తిళ్లను భరించలేక ఆర్ఎఫ్‌సీఎల్ ముఖ్య ఉద్యోగి సెలవులపై వెళ్ళారనే ప్రచారం ఉంది.అయితే గతంలో కూడా ఆర్ఎఫ్‌సీఎల్ కర్మాగారంలో ఉన్న బూడిదను తరలించాలని కొందరు ప్రయత్నించగా అప్పటి కలెక్టర్ ఈ ప్రతిపాదనలను తిరస్కరిస్తూ సర్క్యులర్ జారీ చేసినట్లుగా సమాచారం.ఈ బూడిదను అక్కడ నుంచి తరలిస్తే వరదలతో దిగువ కాలనీలు వర్షాకాలంలో జలమయం అవుతాయని బూడిద తరలింపు ప్రతిపాదనను తిరస్కరించనట్లుగా చెబుతున్నారు.అయితే ఇటీవల కార్పొరేషన్ ఎన్నికల్లో గెలుపొందిన తర్వాత ప్రజలు మనకు అధికారాన్ని అందించారు కదా..మనం ఏం చేసినా చెల్లుతుందనే ధోరణిలో కొందరు అధికార పార్టీ నేతలు ఇలాంటి అక్రమ దందాలకు తెరలేపినట్లుగా బలమైన ఆరోపణలు వస్తున్నాయి.ఇప్పటికే ఎన్టీపీసీ బూడిద వ్యవహారంలో కోట్లాది రూపాయలు అక్రమమార్గంలో లూటీ జరుగుతున్న విషయం తెల్సిందే.ఈ బూడిద దందా లూటీని ప్రశ్నించే గొంతులపై అక్రమ పద్ధతుల్లో కేసులతో వేధించడమే కాక దందా వెలుగులోకి రాకుండా కొన్ని వర్గాలను డబ్బులతో కప్పిపెడుతున్న విషయం అందరికీ తెల్సిందే.ఈ బూడిద దందాతో రేవంత్ ప్రభుత్వానికి తీరని డ్యామేజ్ ఏర్పడుతున్నా పట్టింపులేకుండా ఉండటం వెనక కూడా అనేక అనుమానాలున్నాయి. ఈ బూడిద దందాతో లూటీ చేసిన కోట్లాది రూపాయల్లో వాటాలు ఎవరికి చేరుతున్నాయనే అనుమానాలు సర్వత్రా ఉన్నాయి.ఇదిలా ఉంటే ఇప్పుడు ఆర్ఎఫ్‌సీఎల్ కర్మాగారంలో ఉన్న కోట్లాది రూపాయల విలువైన బూడిదను సొమ్ముచేసుకోవాలని పెద్ద తలకాయలు ఎత్తుగడలు వేస్తుండగా ఆర్ఎఫ్‌సీఎల్ ఫ్యాక్టరీకి సంబంధించిన భూములను కాజేయాలని ద్వితీయ శ్రేణి నేతలు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లుగా తెలుస్తోంది.ఇక తృతీయ శ్రేణి నేతలు కొలువుల దందా మొదలుపెట్టినట్లుగా ప్రచారం ఉంది.ఇలా ఎవరికి తోచిన రీతిలో వారు తమ పనికానిచ్చుకోవడానికి అధికారులను లొంగదీసుకోవడానికి వివిధ మార్గాలను ఎంచుకున్నట్లుగా సమాచారం.అధికారాన్ని అడ్డం పెట్టుకుని పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న వివిధ కర్మాగారాలు,సంస్థలపై ఒత్తిళ్లు పెరిగిపోయినట్లుగా ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా అధికార పార్టీ నేతలకు కొమ్ముకాస్తు తమ నోటిదురుసుతో రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో చెలరేగిపోతున్న అధికారుల వ్యవహారం కూడా శృతిమించుతోంది.ఈ వ్యవహారంలో ఇప్పటికే అనేక వర్గాలు నిరసనలు తెలుపుతున్నా అధికారం తలకెక్కిన నేతలు నిరంకుశంగా వ్యవహరిస్తున్నారు.దీంతో ప్రజల్లో నానాటికి ప్రభుత్వం పైన,అధికార పార్టీపైన వ్యతిరేకత పెరుగుతోంది.అయితే వ్యతిరేకత ఉంటే ఇటీవల జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో అధికార పార్టీకి ప్రజలు ఎలా పట్టం కట్టారనే వాదం తీసుకొచ్చే వారు ఉన్నారు.అయితే స్థానిక ఎన్నికల్లో సహజంగా అధికార పార్టీ వైపే ప్రజలు మొగ్గు చూపుతారు.తమ బతుకులు బాగుపడతాయనే కారణంతో అధికారపార్టీ వైపు అనుకూల ఫలితాలు ఉంటాయి. అంతమాత్రాన ప్రజలు మమ్మల్ని గెలిపించారు కదా..ఏం చేసినా చెల్లుబాటు అవుతుందని విర్రవీగితే అనంతరం జరిగే ఎన్నికల్లో నేలకు దింపడం కూడా ప్రజలకు బాగానే ఎరుక.ఈ ఫార్ములా అనేకసార్లు అనేక సందర్భాల్లో నిరూపితమైన చరిత్ర. స్థానిక ఎన్నికల్లో ఘన విజయం సాధించిన పార్టీలు అనంతరం జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో దారుణంగా బోల్తాపడిన విషయం మరువరాదు.ఈ విషయం రామగుండం నియోజక వర్గానికి కూడా వర్తిస్తుంది.ఇప్పటికైనా ఈ బూడిద దందాలు..కొలువుల జాతరలను మానేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు స్వంత పార్టీనేతలే అంటున్నారు.వచ్చే ఎన్నికల్లో మళ్ళీ హస్తం హవా నడవాలంటే అక్రమదందాలతో పార్టీకి, ప్రభుత్వానికి నష్టం చేసే భజన నేతలను, రౌడీ మూకలను అదుపులో ఉంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.అక్రమ కేసుల తోనో, అతి చేసే అధికారులతోనే తమ స్థానాలు నిలుస్తాయనుకునే నేతలు ఎందరో కాలగర్భంలో కలిసిపోయిన విషయాన్ని గుర్తెరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అంటున్నారు.ఇక మీదటైనా ఈ ప్రాంత వనరులు దుర్వినియోగం కాకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వ పెద్దలపైన ఉన్నదని అంటున్నారు.చూడాలి మరి పట్టించుకుంటారా? లేదా అని?




పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజక వర్గం లోని ఆర్ఎఫ్‌సీఎల్ ఎరువుల కర్మాగారంలో కోట్లాదిరూపాయాల విలువైన నల్ల బూడిదను కొల్లగొట్టడానికి కొందరు నేతలు యత్నిస్తున్నట్లుగా ఆరోపణలు ఊపందుకున్నా యి.అదేవిధంగా మళ్ళీ కర్మాగారంలో కొలు వుల దందా మొదలయినట్లుగా ప్రచారం కూడా జరుగుతోంది. అదేవిధంగా ఎరువుల కర్మాగారానికి చెందిన భూములపైన కూడా కొందరు నేతల కన్నుపడి స్వాహా చేసే ఎత్తు గడలో ఉన్నట్లుగా స్థానికుల్లో చర్చ నడుస్తోంది.

# డ్రగ్స్ వినియోగం

# యువత భవిష్యత్తుకు ముప్పు

**- పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి**

**జనోదయ : రామగుండం రూరల్**

పెద్దపల్లి జిల్లా రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ పరిధిలోని అంతర్గాం పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో, అంతర్గాం మండల కేంద్రంలో ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమం భాగంగా గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్ పర్యవేక్షణలో, రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్, అంతర్గాం ఎస్ఐ వెంకట్ ఆధ్వర్యంలో మండల ప్రజలను ఒకేచోట సమీకరించి పిల్లల భద్రత, డ్రగ్స్ నియంత్రణ, సైబర్ నేరాలు, అరైవ్ అలైవ్ కార్యక్రమం భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి , ఎస్.పి. నాయక్ బంజారా (ప్రవచనకర్త) హాజరయ్యారు.ఈ సందర్భంగా డీసీపీ బి. రామ్ రెడ్డి మాట్లాడుతూ, డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నదని తెలిపారు. యువత చెడు స్నేహాలు, ప్రలోభాలకు లోనుకాకుండా తమ లక్ష్యాలపై దృష్టి పెట్టాలని సూచించారు. ఒక్కసారి డ్రగ్స్‌కు బానిస అయితే ఆరోగ్యం, చదువు, కుటుంబ జీవితం తీవ్రంగా దెబ్బ తింటాయని చెప్పారు. డ్రగ్స్ సమస్య కేవలం వ్యక్తిగత సమస్య మాత్రమే కాకుండా సమాజానికి కూడా ప్రమాదకరమని పేర్కొన్నారు. ఎవరైనా డ్రగ్స్ విక్రయం, వినియోగం చేస్తున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి అని పిలుపునిచ్చారు.పిల్లల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని డీసీపీ తెలిపారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి, మంచి మార్గంలో ముందుకు సాగాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు గమనించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు.డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, లింకులు, ఓటీపీలు ఎవరితోనూ పంచుకోకూడదని హెచ్చరించారు.అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని డీసీపీ తెలిపారు. వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించడం, మితిమీరిన వేగంతో వాహనం నడపకపోవడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగించకపోవడం వంటి నియమాలు పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్, అంతర్గం ఎస్ ఐ బోయ వెంకట్, ఏం వి ఐ రామగుండం సంతోష్ రెడ్డి, అంతర్గం మండల సర్పంచ్ లు, దాదాపు 300 మంది స్థానిక ప్రజలు, యువత, విద్యార్థులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

